ఈనాడు వికారాబాద్

మంగళవారం అక్టోబరు 1, 2024 7

నేటి నుంచి ధ్రువ పత్రాల పరిశీలన: డీఈవో

వికారాబాద్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థుల తాలూకా ధ్రువ పత్రాల పరిశీలన 1:3 కింద నేటి నుంచి పరిశీలన కొనసాగుతుందని జిల్లా విద్యాధికారిణి రేణుకాదేవి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఎంపికైన అభ్యర్థులకు ఎస్ఎంఎస్, ఈ మెయిల్ ద్వారా సమాచారాన్ని అందించారన్నారు. పరిశీలన కార్యక్రమం 5వ తేదీ వరకు ఉంటుందన్నారు. అంశాల వారీగా ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు హాజరు కావాలని ఆమె కోరారు. ఎస్జీటీ కేటగిరీలో అన్ని మాధ్యమాల వారు జిల్లా ఉపాధ్యాయ శిక్షణ సంస్థ (డైట్)కు వెళ్లాలని తెలిపారు. వికారాబాద్-శివారెడ్డిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సహాయకులు, అన్ని అంశాలు, మాధ్యమాల వారు, భాషా పండితులు, పీఈటీలు అన్ని భాషల వారు హాజరు కావాలని సూచించారు. అభ్యర్థులు నిజప్రతులతో రావాలన్నారు.

● బొంరాస్‌పేట,దౌల్తాబాద్,కొడంగల్, న్యూస్‌టుడే: డీఎస్సీ ఫలితాల్లో మండలం లోని లగచర్ల గ్రామానికి చెందిన కావలి రమేష్ బయోసైన్స్‌లో 78.27 శాతం మార్కులతో జిల్లా స్థాయిలో రెండో ర్యాంకు సాధించారు.

వైద్య సేవల్లో లోపం రావొద్దు

వికారాబాద్ మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: వైద్య సిబ్బంది సేవల లోపం వల్ల బాలింతలు, గర్భవతులు ఇబ్బందుల పాలు కాకూడదని జిల్లా వైద్యాధికారి డాక్టర్ పల్వన్‌కుమార్ అన్నారు. సోమవారం జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో మాతృ మరణాలపై ప్రోగ్రాం అధికారిణి డాక్టర్ పవిత్రతో కలిసి వైద్యాధికారులు, ఆశా కార్యకర్తలతో సమీక్షించారు. ప్రమాదకరమైన లక్షణాలున్న గర్భవతులను ప్రాథమిక దశలోనే గుర్తించి తగు చికిత్స అందించాలని అన్నారు. డాక్టర్ రవీంద్రయాదవ్, డెమో పీహెచ్‌సీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రజావాణి అర్జీలకు సత్వర పరిష్కారం



సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం ద్వారా స్వీకరించిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్‌తో కలిసి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి 131 అర్జీలను స్వీకరించామన్నారు. అధికారులు తమ పరిధిలో ఉన్న సమస్యలను పెండింగ్‌లో పెట్టకుండా పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్డీవో వాసుచంద్ర, జిల్లా అధికారులు శ్రీనివాస్, మల్లేశం, ఉపేందర్, కమలాకర్‌రెడ్డి, సత్తార్, మోహన్‌రెడ్డి, వెంకటేశ్వర్లమ్మ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

● ఉద్యోగ విధులను బాధ్యతాయుతంగా నిర్వహిస్తే కలిగే సంతృప్తి ఎంతో ఉంటుందని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పదవీ విరమణ పొందిన జిల్లా ఆడిట్ అధికారి వీరభద్రరావును కలెక్టర్ శాలువా కప్పి సత్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వాల్టాకు తూట్లు.. జోరుగా బోర్లు

న్యూస్‌టుడే, వికారాబాద్, తాండూర్:

● అనుమతి లేకుండా తవ్వకాలు
● పట్టించుకోని అధికారులు



వ్యవసాయానికి నిరంతర విద్యుత్తు సరఫరా జరుగుతోంది. దీంతో సాగు విస్తీర్ణం పెరిగి నీటి వినియోగం కూడా ఎక్కువైంది. ఈ నేపథ్యంలో జిల్లాలో అధికారుల అనుమతులు లేకుండానే బోరుబావుల తవ్వకాలు యథేచ్ఛగా సాగిపోతున్నాయి. కొందరు అక్రమార్కులు నీటి వ్యాపారానికి కూడా బోర్ల తవ్వకాలు చేపడుతున్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో భూగర్భజలాలు పెరిగినా కొన్ని ప్రాంతాల్లో దాదాపు 500 అడుగుల లోతు వరకు బోర్లు తవ్వినా నీటి జాడ కానరావడం లేదు. దీంతో రైతులు ఐదారు చోట్ల బోర్లు తవ్వుతూ నీళ్లు పడక ఆర్థికంగా నష్టపోతున్నారు. బోర్ల తవ్వకాలకు ఇది కూడా ఓ కారణంగా నిలుస్తోంది.

అడుగుల ప్రకారం లెక్క

● ఒక్కో బోరు తవ్వడానికి వ్యయం.. రూ.లక్ష. ● ప్రస్తుతం వంద అడుగుల వరకు రూ.75, వంద నుంచి 150 వరకు రూ.100, 150 నుంచి 200 అడుగుల వరకు రూ.130 ఇలా ఎంత లోతు తవ్వితే అంత అధికంగా వ్యయం. ● సగటున 10 తవ్వితే 6 బోర్లలో మాత్రమే నీటి లభ్యత.

కఠిన చట్టం ఉన్నా..: బోరు బావి తవ్వకానికి ముందుగా భూగర్భ జల శాఖ అధికారుల అనుమతులు తీసుకోవాలి. ఇందుకు ఉద్దేశించిందే 'వాల్టా (నీరు, భూమి, చెట్లు పరిరక్షణ) చట్టం'. ఎంత లోతు, ఏ ప్రాంతంలో బోరు వేయాలో వారు నిర్ధరించిన తర్వాత రెవెన్యూ అధికారుల భూ పరిశీలన చేస్తారు. ఒక్కో బోరు మధ్య 150 నుంచి 300 మీటర్ల వ్యత్యాసం ఉండేలా చేస్తారు. ఈ విధమైన నిబంధనలతో వాల్టా చట్టాన్ని ప్రభుత్వం అమలు చేస్తున్నా, అధికారుల నిర్లక్ష్యం, నేతల ఒత్తిళ్ల వల్ల చట్టం నీరుగారుతోంది.

ఇప్పటివరకు ఇలా..

● అనుమతుల్లేకుండా వేసిన మొత్తం బోర్లు.. **220**
● వికారాబాద్‌లో.. **15**, తాండూరు.. **17**, కొడంగల్.. **8**, పరిగి.. **5** ఇలా జిల్లా వ్యాప్తంగా ఉన్నాయి.

ఆరు బోర్లు వేసినా నీళ్లు రాలే..

– రాములు, మైలార్‌దేవరంపల్లి, వికారాబాద్

నాలుగెకరాల పొలం ఉంది. బోరు బావితో ఆరుతడి పంటలు, కూరగాయల సాగు చేపట్టి ఆర్థికంగా లాభ పడొచ్చని రెండేళ్ల కిందట నాలుగు, ఇటీవల రెండు బోర్లు వేశాను. ఒకదాంట్లో కూడా నీళ్లు రాలేదు. ఏటా నీళ్లు పడతాయన్న ఆశతో బోర్లు వేసి ఆర్థికంగా రూ.4.5 లక్షల వరకు నష్టపోయా. బోర్ల కోసం చేసిన అప్పులు తీర్చడం తలకు మించిన భారంగా మారింది.

ఫిర్యాదులను పరిశీలించి చర్యలు తీసుకుంటున్నాం

– లింగ్యానాయక్, జిల్లా అదనపు కలెక్టర్



మా దృష్టికి వచ్చిన ఫిర్యాదులపై పరిశీలించి చర్యలు తీసుకుంటున్నాం. నేరుగా రెవెన్యూ శాఖ అనుమతులు ఇవ్వకుండా భూగర్భజల శాఖ అధికారులకులేఖలు రాస్తున్నాం.

నేవీ ప్రాజెక్టు వ్యతిరేక ఉద్యమానికి మద్దతివ్వండి



పూడూరు మండలం దామగుండంలో నేవీ ప్రాజెక్టు ఏర్పాటుకు వ్యతిరేకంగా మద్దతు ఇవ్వాలని కోరుతూ సినీ నటుడు సోనూసూద్‌కు వినతి పత్రం అందించారు. భారాస నాయకుడు జి. నాగేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో దామగుండం పరిరక్షణ కమిటీ సభ్యులు హైదరాబాద్‌లో సోమవారం సోనూసూద్‌ను కలిసి ఈ మేరకు విన్నవించారు. – న్యూస్‌టుడే, పూడూరు.

వ్యవసాయ ఉత్పత్తుల నిల్వకు శీతల గిడ్డంగి నిర్మిస్తాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి

తాండూరుగ్రామీణ, న్యూస్‌టుడే: రైతులు పండించే ఉల్లి, పసుపు, మిరప వంటి ఉత్పత్తులను గిట్టుబాటు ధర లభించే వరకు నిల్వ ఉంచేందుకు తాండూరు మండలంలో త్వరలో శీతల గిడ్డంగుల్ని నిర్మింపజేస్తామని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. సోమవారం నిర్వహించిన తాండూరు మండలం ఎల్మకన్నె వ్యవసాయ సహకార సంఘం సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. టపాసులు కాల్చి ఎమ్మెల్యేకు కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికి శాలువా, పూలమాలలతో సత్కరించారు. రూ.21కోట్ల బంగారు తాకట్టు రుణాలు అందించిన తాండూరు మండల సంఘం జిల్లాలో ప్రథమ స్థానంలో నిల్వడంపై ఉమ్మడి రంగారెడ్డి జిల్లా సహకార సంఘాల ఉపాధ్యక్షులు రవీందర్‌గౌడ్, సీఈఓ శ్రీనివాస్‌ను ఎమ్మెల్యే అభినందించారు. కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు ఉత్తమ్‌చంద్, మండలాధ్యక్షులు జన్నెనాగప్ప, మాజీ జడ్పీటీసీ ధారాసింగ్, వ్యవసాయ విపణి అధ్యక్షులు బాల్‌రెడ్డి, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలే ఎక్కువ అర్జీలు

తాండూరుటౌన్: రెవెన్యూ సమస్యలకు సంబంధించినవే ప్రజావాణిలో ఎక్కువ అర్జీలు ఉంటున్నాయని తాండూరు సబ్ కలెక్టరు ఉమాశంకర్ ప్రసాద్ తెలిపారు. పట్టణంలోని సబ్ కలెక్టరు కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. మొత్తం 10 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

పదహారేళ్ల కల సాకారం

కళాశాల విద్యార్థులకు అందుబాటులోకి మైదానం



కొనసాగుతున్న శిథిలాల తొలగింపు పనులు

పెద్దేముల్, న్యూస్‌టుడే: ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల ఆటలాడేందుకు మైదానం స్థలం కల నెరవేరబోతోంది. పదహారేళ్లుగా చేస్తున్న ప్రయత్నాలకు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి చొరవతో అడుగు పడింది. మండల కేంద్రం పెద్దేముల్‌లో 2000 సంవత్సరంలో జూనియర్ కళాశాల మొదలైంది. సొంత భవనం లేకపోవడం వల్ల ఉన్నత పాఠశాలలో అదనపు తరగతి గదుల్లో 50 మంది విద్యార్థులతో కొనసాగింది. ఆటలు ఆడేందుకు మైదానం సమస్య మాత్రం తీరలేదు.

భూమి కేటాయించడంతో సొంత భవనం

ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణానికి ప్రభుత్వం నిధులు కేటాయించింది. సుమారు రెండేళ్లు తాత్కాలికంగా తరగతులు సాగాయి. సొంత భవనం లేక విద్యార్థులు అనేక అవస్థలు పడాల్సి వచ్చింది. రెవెన్యూ అధికారులు గ్రామ శివారులో 2005లో 3 ఎకరాల 37 గుంటల భూమిని కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ముందుగా వసతి గృహం వెనుక భాగం నుంచి గదుల నిర్మాణ పనులు మొదలు పెట్టి 2012లో భవనాన్ని అందుబాటులోకి తెచ్చారు. దీంతో సుమారు 300 మంది విద్యార్థులు ఏటా విద్యను అభ్యసించారు.

ముందు భాగంలో సామగ్రి నిల్వ గోదాములు

కళాశాల ముందు భాగంలో నీటిపారుదల కార్యాలయం, నివాస గృహాలు, కోట్‌పల్లి ప్రాజెక్టు నిర్మాణం నాటి సామగ్రి నిల్వ ఉంచిన గోదాంలు ఉన్నాయి. కార్యాలయ నిర్వహణ తాండూరుకు తరలివెళ్లడంతో భవనాలన్నీ శిథిలమయ్యాయి. చెట్లు, పొదలు పెరిగి పాములకు ఆవాసంగా మారాయి. ఆట స్థలం లేక విద్యార్థులు ఆటలకు దూరమయ్యారు. నీటి పారుదల శాఖ అధికారులు వీటిని పట్టించుకోకపోవడంతో విద్యార్థులకు మైదానం కరవైంది. సుమారు రెండు ఎకరాల విస్తీర్ణంలో గల శిథిలాలు తొలగిస్తేనే సమస్య తీరుతుంది. ఈ సమస్యలను విద్యార్థులు, సిబ్బంది అనేకసార్లు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లారు. చివరికి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి స్థానికులు విషయాన్ని చెప్పడంతో ఆయన చొరవ చూపి శిథిలాల తొలగింపు చర్యలు చేపట్టారు. ఈ శరవేగంగా సాగుతున్నాయి.

సారూ.. వంతెన నిర్మించరూ..



జుంటివాగులో నిలబడి నిరసన తెలుపుతున్న రైతులు

యాలాల, న్యూస్‌టుడే: యాలాల మండలంలోని ఎన్కేపల్లి గ్రామ సమీపంలోని జుంటి వాగుపై వంతెన నిర్మించాలని ఎన్కేపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు గొల్ల కిష్టప్ప ఆధ్వర్యంలో రైతులు జుంటివాగులో నిలబడి నిరసన వ్యక్తం చేశారు. పేర్కంపల్లి గ్రామ శివారులో దాదాపు 300 ఎకరాల భూములు ఉన్నాయని, పొలాలకు వర్షాకాలంలో వెళ్లాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సి వస్తోందన్నారు. పొలాల్లో కలుపు తీయడానికి మహిళలు ఎన్కేపల్లి గేట్ మీదుగా ఖాసీంపూర్ నుంచి దాదాపు 12కిలోమీటర్లు నడుచుకుంటూ వెళ్తున్నారని వాపోయారు. ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి స్పందించి బ్రిడ్జి నిర్మాణం చేయాలని రైతులు కోరుతున్నారు. కార్యక్రమంలో మల్గ లక్ష్మప్ప, రాములు, నరేష్, కంతి లక్ష్మప్ప, ఫకీరప్ప, పాపన్న, బాలప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు మెచ్చేలా.. నచ్చేలా పనిచేయండి



మాట్లాడుతున్న మల్టీ జోన్-2 ఐజీ సత్యనారాయణ

వికారాబాద్, న్యూస్‌టుడే: ప్రభుత్వ లక్ష్యాలను దృష్టిలో పెట్టుకొని ప్రజలు నచ్చేలా, మెచ్చేలా పోలీసులు సమర్థంగా పని చేసి పోలీసుశాఖకు మంచి పేరు తీసుకురావాలని మల్టీ జోన్-2 ఐజీ సత్యనారాయణ తెలిపారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇసుక, రేషన్ బియ్యం, గంజాయి, మట్కా వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారిని ఉపేక్షించకుండా వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అనుమానిత(సస్పెక్ట్) షీట్ తెరవాలని అన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే పోలీసులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంతకుముందు వికారాబాద్ పట్టణ పోలీస్‌స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి అపరిష్కృత కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి, ఏఎస్పీ రవీందర్‌రెడ్డి, వికారాబాద్, తాండూర్, పరిగి డీఎస్పీలు శ్రీనివాస్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి, కరుణసాగర్‌రెడ్డి, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న బోరుబండి స్వాధీనం



పరిగి గ్రామీణ, న్యూస్‌టుడే: ప్రభుత్వానికి పన్నులు కట్టకుండా కళ్లుగప్పి రూ. కోటి విలువ చేసే బోరు బండిని అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ సంతోష్‌కుమార్ సోమవారం తెలిపిన ప్రకారం.. పరిగి పట్టణం మీదుగా బీజాపూర్ జాతీయ రహదారిపై వెళ్తున్న వాహనాలను కొడంగల్ చౌరస్తా వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహించారు. కొత్త బోరు బండి ఎలాంటి నంబరు లేకుండా వెళ్తుండడంతో అనుమానంతో అడ్డుకుని వివరాలు అడిగారు. ఎలాంటి పత్రాలు వారు చూపకపోవడంతో వాహనాన్ని అదుపులోకి తీసుకుని ఠాణాకు తరలించి ఆరా తీశారు. నగరంలో తయారైన ఈ వాహనం పరిగి మీదుగా ముంబయికి తరలుతోందని తేలింది. వాహన వివరాలను ఎంవీఐకి పంపించామని ఎస్ఐ తెలిపారు. ఈ విషయమై ఎంవీఐ వీరేంద్రనాయక్‌ను వివరణ కోరగా.. వాహనానికి సంబంధించిన టీఆర్ నంబరు, పత్రాలను తీసుకు రావాలని డ్రైవర్లకు సూచించినట్లు తెలిపారు.

సామర్థ్యానికి అనుగుణంగా బోధన



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎండీ యాసీన్

మోమిన్‌పేట, న్యూస్‌టుడే: విద్యార్థుల సామర్థ్య అంచనా పరీక్షల నిర్వహణలో ఉపాధ్యాయులు కీలకపాత్ర వహించాలని రాష్ట్ర పరిశీలకుడు ఎండీ యాసీన్ అన్నారు. సోమవారం మోమిన్‌పేట బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జాతీయ సాధన సర్వే (న్యాస్) నమూనా పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పరీక్ష విధానాన్ని, డిజిటల్ బోర్డులను పరిశీలించి మాట్లాడారు. విద్యార్థుల సామర్థ్యాలకు అనుగుణంగా బోధన సాగాలన్నారు. కాలానుగుణంగా బోధన అభ్యాసనలో సాంకేతికతను వినియోగించుకోవాలన్నారు. విద్యార్థులను సాంకేతిక వైపు మళ్లించేందుకు ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి మల్లేశం, జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి మస్తారామ్, ఉపాధ్యాయులు సీఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాలు ఆధ్యాత్మిక కేంద్రాలుగా మారాలి

వికారాబాద్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రతి దేవాలయం ఆధ్యాత్మికత కేంద్రంగా మారాలని, ఈ కేంద్రాల్లో ధర్మంపై అవగాహన ఉన్న వారిని మాత్రమే సభ్యులుగా నియమించాలని విశ్వహిందూ పరిషత్ సాధు పరిషత్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు శంకరస్వామి అన్నారు. సోమవారం తిరుమల తిరుపతి దేవస్థానం లడ్డూలో కల్తీ విషయాన్ని ఖండిస్తూ విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నాయకులు కలెక్టర్ కార్యాలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. అనంతరం కలెక్టర్ ప్రతీక్‌జైన్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణస్వామిజీ, విశ్వహిందూ పరిషత్తు జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్, జిల్లా కార్యదర్శి శ్రీలతారెడ్డి, సహకార్యదర్శి ప్రభాకర్‌గౌడ్, దోమ శ్రీకాంత్, భాజపా జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, మహిళా అధ్యక్షురాలు శిరీష పాల్గొన్నారు.

బస్సు డ్రైవరుకు గుండె నొప్పి

ముందస్తు నిలిపివేత.. ప్రయాణికులు సురక్షితం

తాండూరు టౌన్, న్యూస్‌టుడే: బస్సు డ్రైవరుకు గుండె నొప్పి రావడంతో గ్రహించి ముందస్తు జాగ్రత్తగా బస్సును రోడ్డువారగా నిలిపివేయడంతో ప్రయాణికులు భద్రంగా దిగారు. ప్రయాణికులు, ఆర్టీసీ డిపో మేనేజర్ నరేష్ తెలిపిన ప్రకారం.. తాండూరు డిపోకు చెందిన డ్రైవరు గోపాల్‌గౌడ్, కండక్టరు శ్రీనివాస్ సోమవారం మధ్యాహ్నం బషీరాబాద్‌కు 50 మంది ప్రయాణికులతో బయలుదేరారు. మార్గమధ్యలో కాశీంపూరు గ్రామ సమీపంలోకి రాగానే డ్రైవరుకు ఛాతిలో నొప్పి వచ్చింది. విషయాన్ని గ్రహించి కండక్టరుకు తెలిపారు. బస్సును వెంటనే రోడ్డు పక్కన ఆపేశారు. 108 అంబులెన్సుకు ఫోన్ చేసి జిల్లా ఆస్పత్రికి తరించారు. పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉంది హైదరాబాద్‌కు తీసుకు వెళ్లాలని సూచించారు. అక్కడి నుంచి స్థానిక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అతనికి ప్రాథమికంగా వైద్యం అందించిన వైద్యులు మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. డిపో మేనేజరు నరేష్ ఆస్పత్రికి వచ్చి డ్రైవరు పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతానికి అతని పరిస్థితి నిలకడగా ఉందని సహ ఉద్యోగులు తెలిపారు.

సొంతిల్లు.. కలేనా..

న్యూస్‌టుడే, పరిగి, వికారాబాద్ కలెక్టరేట్:

రెండు పడక గదుల ఇళ్లపై ఎందుకీ తాత్సారం



పరిగిలో పూర్తయిన మూడు బ్లాకులు

● జిల్లా వ్యాప్త లక్ష్యం.. 5,740
● నిర్మాణాలు.. 3,800
● పూర్తయినవి.. 1,900

పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు గత ప్రభుత్వం రెండు పడక గదుల నిర్మాణాలను చేపట్టింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 'ఇందిరమ్మ ఇళ్ల పథకం'గా మార్చి ప్రజాపాలనలో దరఖాస్తులు స్వీకరించింది. ఏళ్లు గడుస్తున్నా కొలిక్కి రాకపోవడంతో ఇవి ఎప్పుడెప్పుడు అందుతాయా, తమ కల ఎప్పుడు నెరవేరుతుందా అని పేదలు ఆశతో ఎదురు చూస్తున్నారు.

స్థల సేకరణతో సరి

పెరిగిన నిర్మాణ సామగ్రి ధరలతో ప్రస్తుత పరిస్థితుల్లో ఇంటి నిర్మాణం తలకుమించిన భారంగా మారింది. దీంతో సర్కారు సహకారంపై ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. జిల్లాలోని వికారాబాద్, పరిగి, తాండూరు, కొడంగల్ నియోజకవర్గాల పరిధిలో ఆరేళ్ల క్రితం 5740 ఇళ్లను చేపట్టాలని తలపెట్టినా చివరకు 3800 ఇళ్లను తీసుకున్నారు. తాండూరులో పంపిణీలో తాత్సారం జరుగుతోంది. కొడంగల్‌లో స్థల సేకరణతో సరిపెట్టారు. వికారాబాద్‌లో ఇంకా కొలిక్కి రావాల్సి ఉంది. బిల్లుల్లో జరుగుతున్న జాప్యంతో గుత్తేదారు వెనుకాముందు ఆలోచిస్తూ నెట్టుకొస్తున్నారు.

రూ.25 కోట్ల అంచనా వ్యయం

పరిగి నియోజకవర్గంలోని పూడూరు, పరిగి, దోమ, కుల్కచర్ల మండలాల్లో రూ.25కోట్ల అంచనా వ్యయంతో 480 గృహాలను ఏర్పాటు చేయాలన్నది లక్ష్యం. కానీ ఇప్పటివరకు ఎక్కడా పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాలేదు. పరిగి మున్సిపాలిటీ పరిధిలోని విద్యారణ్యపురిలో చేపట్టిన 300 గృహాల్లో 180 రెండు పడక గదుల నిర్మాణం పూర్తికాగా రంగుల పనులు చేపట్టాల్సి ఉంది. కుల్కచర్లలో 80 గృహాలు మంజూరయ్యాయి. రెవెన్యూ అధికారులు స్థలం చూపకపోవడంతో అగ్రిమెంట్ సమయం కూడా దాటిపోయింది. దీంతో ఒక్కటీ ప్రారంభానికి నోచుకోలేకపోయింది. గతంలో ఇదే మండల పరిధిలో ఉన్న అడవి వెంకటాపూర్‌లో నిర్మించిన ఇల్లు ఎవరికీ కేటాయించకపోవడంతో మందుబాబులు, పోకిరీలకు నిలయంగా మారాయి.

పూర్తయ్యేలా కృషి చేస్తాం

కొన్ని గృహాలు ఇంకా అసంపూర్తిగా ఉన్నాయి. వాటిని కూడా త్వరగా పూర్తయ్యేలా కృషి చేస్తున్నాం. ఇటీవలే కొందరి గుత్తేదారులకు పెండింగ్‌లో ఉన్న బిల్లుల్లోనూ కొంత మేరకు అందాయి. దీంతో పూర్తికాని వాటిపై దృష్టి సారిస్తున్నాం. – మహేష్, జేఈఈ, రోడ్లు, భవనాల శాఖ.

వెల్లువలా దరఖాస్తులు

పూర్తయిన ఇళ్లను కేటాయించేందుకు పేదల నుంచి దరఖాస్తులను తీసుకోవాలని గత కలెక్టర్ నారాయణ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. దీంతో పరిగి పురపాలక సంఘం పరిధిలో వార్డుల వారీగా స్వీకరణ కేంద్రాలు ఏర్పాటు చేసి దరఖాస్తులు తీసుకోవడంతో మొత్తంగా 1554 వచ్చాయి. వాటిపై సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో విచారణ కూడా పూర్తిచేశారు. వీటిలో స్థానిక అధికారులు 600 మందిని అర్హులుగా ఎంపిక చేసి వాటిని అందులో ఉన్నతాధికారుల నుంచి 399కి అనుమతి లభించింది.

ఆత్మీయ నేస్తాలు.. ప్రాణదాతలు

నేడు జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం

అత్యవసరం ఏర్పడితే.. బంధం లేకున్నా రక్తదానం చేసే దాతలు ఎందరో ఆదర్శంగా నిలుస్తున్నారు. నిండు ప్రాణాలు నిలబెట్టే వారు ప్రత్యక్ష దైవంగా భావిస్తుంటాం. చిన్నారి మొదలు వృద్ధుల వరకు వివిధ సమయాల్లో రక్తం దొరక్క అల్లాడుతుంటారు. వారికి మేమున్నామంటూ రక్తదానం చేసే వారు ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో భారీగా ఉండటం విశేషం. ఏ సమయమైనా ముందుకొస్తున్నారు. వ్యక్తిగతంగా, బృందాలుగా బాధ్యతను నిర్వర్తిస్తున్నారు. అలాంటి ఆత్మీయులపై జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం సందర్భంగా 'న్యూస్‌టుడే' కథనం.

ఈ సారు.. 49 సార్లు




సిద్దిపేట వాసి, మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా. కె. హుస్సేన్ ఇప్పటి వరకు 49 సార్లు రక్తదానం చేశారు. ఓ+ గ్రూపు కాగా.. 18వ ఏట నుంచే ఇస్తున్నారు. డిగ్రీ ప్రథమ సంవత్సరంలో ఓ మహిళకు అత్యవసరం కాగా, వెంటనే స్పందించడంతో ప్రాణం నిలబడటం సంతృప్తినిచ్చింది. అప్పటి నుంచి 30 ఏళ్లుగా అత్యవసరంలో స్పందిస్తున్నారు. సర్కారు దవాఖానాల్లో చికిత్స పొందే నిరుపేదలకు తొలి ప్రాధాన్యంగా రక్తదానం చేస్తున్నారు.

సామాజిక బాధ్యతగా..



సిద్దిపేట జిల్లాలో సామాజిక మాధ్యమాల వేదికగా పలువురు ఆపన్నహస్తాన్ని అందిస్తున్నారు. పోలీసు బ్లడ్ ఆర్గనైజేషన్, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి బ్లడ్ గ్రూపు (సిద్దిపేట), సిద్దిపేట బ్లడ్ బ్యాంకు వంటి వాట్సాప్ గ్రూప్‌ల్లో అన్ని వర్గాల వారు భాగస్వాములయ్యారు. ఆరేళ్లలో 2500 మందికి పైగా రక్తదానం చేశారు. 2 వేల మంది వివరాలు ఉండగా, సమన్వయంతో ముందుకు సాగుతున్నట్లు కుకునూరుపల్లి పోలీసు కానిస్టేబుల్ దాసరి చంద్రశేఖర్ తెలిపారు.



యువ సారథ్యం.. స్ఫూర్తి మంత్రం



బీఎస్‌డీఎఫ్ (భారత్ సొసైటీ డెవలప్‌మెంట్ ఫోర్సు) ఆధ్వర్యంలో పదేళ్ల కిందట బ్లడ్ సర్కిల్ గ్రూపు ఏర్పాటు చేశారు. అనుబంధంగా 16 వాట్సాప్ గ్రూపులు ఉండగా.. వాటిల్లో మొత్తం 2 వేల మంది సభ్యులున్నారు. రక్తదానంపై అవగాహన కల్పిస్తున్నారు. అత్యవసరంలో ఏటా 300 మంది స్పందిస్తున్నారు. స్ఫూర్తిని కొనసాగిస్తున్నామని వ్యవస్థాపక అధ్యక్షుడు నాగార్జున్, సమన్వయకర్త భాను వెల్లడించారు.



రక్తదాతలు

తల్లిదండ్రుల ఆనందం చూసి..



2011లో తలసేమియాతో బాధపడుతున్న చిన్నారికి రక్తదానం చేయగా.. ఆ తల్లిదండ్రుల కళ్లలో కనిపించిన ఆనందం అతడికి రక్తదానం చేసేలా ప్రేరేపించింది. అప్పటి నుంచి ఇప్పటివరకు 48 సార్లు రక్తదానం చేశారు. అతడే మెదక్ జిల్లా పాపన్నపేట మండలం కుర్తివాడకు చెందిన బూర్జుకాడి నరేష్, ఎంకాం చదువుతున్నప్పుడు అమ్మ సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్‌తో కలిసి పని చేయడం ఈ దిశగా అడుగేయడానికి తోడ్పడింది.

శిబిరాలు నిర్వహిస్తూ..



సంగారెడ్డి జిల్లా నాగలిగిద్ద మండలం ఉట్‌పల్లికి చెందిన **ఓంప్రకాశ్..** ఇప్పటివరకు 40 సార్లు రక్తదానం చేశారు. ఇతడిది ఓ- నెగెటివ్ గ్రూప్. ఈ గ్రూప్ వారు అరుదుగా ఉంటారు. రెండు నెలలకోసారి నారాయణఖేడ్‌లో శిబిరాలు నిర్వహిస్తూ యువత రక్తదానం చేసేలా ప్రోత్సహిస్తున్నారు. 63050-43932 నంబరుకు ఫోన్ చేస్తే చాలు దానం చేయడానికి సిద్ధంగా ఉంటారు.

ఎవరు చేయొచ్చంటే..

- 18 - 55 ఏళ్లున్న వారు ఎవరైనా రక్తదానం చేయొచ్చు.
- మూడు నెలల వ్యవధితో ఏడాదికి నాలుగుసార్లు ఇవ్వొచ్చు.
- ఒక వ్యక్తి రక్తదానం చేయడం ద్వారా ముగ్గురు ప్రాణాలను కాపాడవచ్చు.

159 సార్లు ముందుకొచ్చి..



ఎవరికైనా రక్తం అత్యవసరమని తెలిస్తే చాలు వెంటనే అక్కడికి వెళ్లిపోతారు...తాండూరుకు చెందిన వైద్యుడు సంపత్‌కుమార్.. ఇప్పటివరకు 159 సార్లు రక్తదానం చేశారు.

నాన్న స్ఫూర్తితో..



సంగారెడ్డికి చెందిన సాజీద్ అలీ తండ్రి షబ్బీర్‌అలీ. నాన్న స్ఫూర్తిగా రక్తదానం చేసేందుకు ముందుకొచ్చారు. ప్రాణాపాయ పరిస్థితుల్లో ఉన్న కాన్పు, రోడ్డు ప్రమాదాల బాధితులకు రక్తం ఇచ్చి కాపాడారు. ఎవరికైనా, ఎప్పుడైనా అత్యవసరమైతే 96527-86001 నంబరుకు ఫోన్ చేస్తే చాలు సిద్ధంగా ఉంటారు.

న్యూస్‌టుడే, సిద్దిపేట, సంగారెడ్డి అర్బన్, తాండూరు నారాయణఖేడ్ రూరల్, మెదక్ టౌన్

'మల్లన్న' హుండీ ఆదాయం రూ.63.66 లక్షలు



కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది, భక్తులు

చేర్యాల: కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయానికి హుండీల ద్వారా రూ.63.66 లక్షల నగదుతో పాటు బంగారు, వెండి కానుకలు వచ్చినట్లు ఈవో ఆలూరు బాలాజీశర్మ తెలిపారు. మెదక్ జిల్లా దేవాదాయశాఖ సహాయ కమిషనరు చంద్రశేఖర్ పర్యవేక్షణలో సోమవారం మొత్తం 24 హుండీలను విప్పి భక్తులు సమర్పించిన నగదు, ఆభరణాల లెక్కింపు చేపట్టారు. రూ.63,66,933 నగదు, 51 గ్రాముల మిశ్రమ బంగారం, ఒక కిలో 50 గ్రాముల మిశ్రమ వెండి కానుకలు, 25 విదేశీ కరెన్సీ, 6 క్వింటాళ్ల బియ్యం వచ్చినట్టు చెప్పారు. ఇది 76 రోజుల్లో సమకూరిందని పేర్కొన్నారు. ప్రధానార్చకుడు మహదేవుని మల్లికార్జున్, ఏఈవో బుద్ధి శ్రీనివాస్, పర్యవేక్షకులు, అర్చకులు, సిబ్బంది, సిరిసిల్లకు చెందిన శివరామకృష్ణ భజన మండలి 200 మంది సభ్యులు పాల్గొన్నారు.

విదేశీ భాషలు నేర్చుకుంటే ఉన్నతస్థానం

సిద్దిపేట టౌన్: విదేశీ భాషలు నేర్చుకుంటే విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నతస్థాయికి ఎదగవచ్చని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. సిద్దిపేట ఇందిరానగర్ జడ్పీ ఉన్నత పాఠశాల రాష్ట్రానికే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ఇఫ్లూ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో పాఠశాలలో విదేశీ భాషలు నేర్చుకున్న విద్యార్థులకు సోమవారం ధ్రువపత్రాలను ఆయన అందజేశారు. పలువురు విద్యార్థులు తాము నేర్చుకున్న ఇంగ్లిష్, ఫ్రెంచి, స్పానిష్ భాషల్లో సంభాషించి అబ్బురపరిచారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడారు. పాఠశాల కోసం ఆడిటోరియం ఏర్పాటు చేయాలని ఉపాధ్యాయులు కోరగా రూ.10 లక్షలు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. అదనపు తరగతి గదులు, మురుగు పారుదల వ్యవస్థకు నాట్కో నుంచి రూ.40 లక్షలు ఇస్తామని చెప్పారు. 10 జీపీఏ సాధించిన విద్యార్థులందరికీ తన సొంత ఖర్చుతో ఐప్యాడ్‌లు అందజేస్తానని హామీ ఇచ్చారు. ఉపాధ్యాయులను సన్మానిస్తానన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాజప్రభాకర్‌రెడ్డి, సెక్టోరల్ అధికారి రామస్వామి, భారాస నాయకులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటలకు సాంకేతికత అవసరం



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న వీసీ, అనురాగ్ వర్సిటీ అధికారులు

ములుగు: ఉద్యాన పంటల సాగులో సాంకేతిక విద్య ఎంతో అవసరమని సిద్దిపేట జిల్లా ములుగులోని కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి నీరజ ప్రభాకర్ అన్నారు. సోమవారం పరిపాలన విభాగం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో హైదరాబాద్‌కు చెందిన అనురాగ్ వర్సిటీ, ఉద్యాన విశ్వవిద్యాలయం మధ్య పలు అంశాలపై పరస్పర ఒప్పందం కుదుర్చుకున్నాయి. భవిష్యత్తులో రెండు సంస్థల ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. రిజిస్ట్రార్ భగవాన్, డీన్‌లు లక్ష్మీనారాయణ, రాజశేఖర్, విజయ, అనురాగ్ విశ్వవిద్యాలయం అధికారులు అర్చన, నారాయణరెడ్డి, ప్రతిభ పాల్గొన్నారు.

చికెన్ ధరలు			
ఫాంరేటు	110-00	డ్రెస్డ్	191-00
రిటైల్	132-00	స్కిన్‌లెస్	218-00

హ్యాండ్‌బాల్ ఉమ్మడి మెదక్ జిల్లా జట్ల ఎంపిక

హుస్నాబాద్, న్యూస్‌టుడే: హుస్నాబాద్‌లో సోమవారం ఉమ్మడి మెదక్ జిల్లా హ్యాండ్‌బాల్ జట్లు ఎంపిక చేశారు. స్థానిక మినీ స్టేడియంలో జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో అండర్-17 బాలబాలికల హ్యాండ్‌బాల్ పోటీలు నిర్వహించారు. పురపాలిక అధ్యక్షురాలు ఆకుల రజిత ప్రారంభించారు. ప్రతిభ చూపిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఎంపికైన వారు అక్టోబరు 3వ తేదీ నుంచి 5వ తేదీ వరకు నారాయణపేట జిల్లా కోస్గిలో జరిగే టోర్నీలో పాల్గొంటారు. హెచ్‌ఎం వాసుదేవరెడ్డి, పుర ఉపాధ్యక్షురాలు ఐలేని అనిత, లింగమూర్తి, రాజు, ఆర్. శ్రీనివాస్, కౌన్సిలర్లు నళిని, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

భారతసైన్యానికి మరో అధునాతన ఆయుధం

మనోహరాబాద్, న్యూస్‌టుడే: అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో డీఆర్‌డీవో, భారత సైన్యం సహకారంతో మేకిన్ ఇండియాలో భాగంగా అధునాతన మెషిన్‌గన్‌ను తయారు చేశామని లోకేశ్ మెషిన్ లిమిటెడ్ కోఛైర్మన్ శ్రీకృష్ణ అన్నారు. మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం కాళ్లకల్ పారిశ్రామికవాడలో లోకేష్ మెషిన్ పరిశ్రమ తయారు చేసిన 9x19 ఎంఎం 550 మెషిన్‌గన్‌లను సోమవారం దిల్లీకి తరలించే వాహనాన్ని మేజర్ జనరల్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ఎస్‌ఎం, వీఎస్‌ఎం, జీవోసీ రాకేశ్‌కుమార్ మనోచా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయనకు శ్రీకృష్ణ, ఆర్మీ అధికారులు ఘన స్వాగతం పలికారు. పరిశ్రమలో ప్రదర్శనకు ఉంచిన ఆయుధాల పనితీరు, తయారీకి వాడిన ముడిసరకుల సమాచారాన్ని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విదేశాల నుంచి ముడిసరకు దిగుమతి చేసుకోకుండా తయారు చేయడం మంచి పరిణామమని, ఇలాంటివి భారత సైన్యానికి ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో పరిశ్రమ ఎండీ లోకేశ్వరరావు, విశ్రాంత ఆర్మీ అధికారి రాజీవ్ శర్మ, ఆర్మీ అధికారులు, పరిశ్రమ ప్రతినిధులు పాల్గొన్నారు.



ఆయుధాల వాహనాన్ని ప్రారంభిస్తున్న మేజర్ జనరల్ రాకేశ్‌కుమార్ మనోచా

రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో ప్రతిభ



పతకాలు సాధించిన క్రీడాకారులు

సిద్దిపేట టౌన్: నిజామాబాద్‌లో ఇటీవల తెలంగాణ యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో సిద్దిపేట క్రీడాకారులు ప్రతిభ చాటారు. అండర్-18 విభాగంలో రిథమిక్ పేర్(జంట) అంశంలో ఎల్. సింధూరి, మనీషా స్వర్ణాలు సాధించారు. 45 -55 పురుషుల విభాగంలో ట్రెడిషనల్ అంశంలో పల్లె సురేశ్ స్వర్ణ పతకం, మహిళల విభాగంలో ఉమాదేవి నాలుగో స్థానంలో నిలిచారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తోట అశోక్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డిలు వారిని శిక్షకులు సతీష్, సంధ్యలను అభినందించారు.

మహిళా ప్రయాణికులే లక్ష్యంగా చోరీలు



అరెస్టయిన నిందితులు

రెజిమెంటల్‌బజార్: మహిళా ప్రయాణికులే లక్ష్యంగా చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలు, చోరీ వస్తువులను కొనుగోలు చేసిన ఇద్దరిని టాస్క్‌ఫోర్స్, గోపాలపురం పోలీసులు అరెస్టు చేశారు వారి నుంచి 20 చరవాణులు, ఓ బైక్ స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ వై.వి.ఎస్. సుధీంద్ర తెలిపిన వివరాలు.. సిద్దిపేట జిల్లా గజ్వేల్‌కు చెందిన సిరిగిరి కవిత పండ్లు విక్రయిస్తుంది. మేడ్చల్‌కు చెందిన ఆమె మరిది వాంకుడోత్ ప్రసాద్ ఆటోడ్రైవర్. వచ్చే ఆదాయం చాలక ఇద్దరూ కలిసి చోరీల బాటపట్టారు. రద్దీ ప్రాంతాల్లో, ఆర్టీసీ బస్సుల్లో, మహిళల బ్యాగుల్లోని చరవాణులు దొంగిలించి, వాటిని కాచిగూడకు చెందిన మహ్మద్ రఫీయుద్దీన్, మహ్మద్ ఇస్మాయిల్‌కు విక్రయిస్తున్నారు. ఫిర్యాదులు రాగా పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నిందితులు రైల్వేస్టేషన్ ప్రాంతంలో అనుమానాస్పదంగా కనిపించగా అదుపులోకి తీసుకుని విచారించగానేరం అంగీకరించారు. గోపాలపురం, ఉప్పల్, కామారెడ్డి, ఓయూ, గౌరారం, సిద్దిపేట, పేట్‌బషీరాబాద్, రామాయంపేట, మేడ్చల్ పరిధిలో చోరీలకు పాల్పడ్డారు. గతంలోనూ 13 కేసుల్లో నిందితులుగా ఉన్నారు. సొత్తు కొనుగోలు చేసిన వారినీ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

పూల తోట.. సస్యరక్షణతోనే దిగుబడి

రైతేరాజు

న్యూస్‌టుడే, చేర్యాల

డిమాండ్‌తో పాటు సీజన్‌కు అనుగుణంగా పంటల సాగు లాభదాయకం. రానున్నది పండుగల సీజన్. ఈ తరుణంలో పూలకు డిమాండ్‌కు అధికంగా ఉంటుంది. ఇటీవల కురిసిన వర్షాలు, మారిన వాతావరణంతో పూల తోటల్లో సస్యరక్షణ చర్యలు ఎంతో అవసరం. ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో బంతి, చామంతి, మల్లె, కనకాంబరం ఎక్కువగా తోటలు సాగు చేస్తున్నారు. ఈ తరుణంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను సిద్దిపేట తోర్నాల వ్యవసాయ పరిశోధన కేంద్రం కోఆర్డినేటర్, సీనియర్ శాస్త్రవేత్త డాక్టరు జక్కుల విజయ్ ఇలా వివరించారు.

బంతి..: బంతి తోటలో ప్రస్తుతం పేనుబంక సమస్య అధికంగా ఉంటుంది. ఇవి మొక్కలోని రసాన్ని పీల్చుకుంటాయి. ఆశించిన దిగుబడి రాదు. నివారణకు ఎసిఫేట్ 1 గ్రా. లేదా డైమిథోయేట్ 2 మి.లీ. మందును లీటరు నీటికి కలిపి 15 రోజులకోసారి పిచికారీ చేయాలి. దీపపు పురుగులు ఆకులపై ఎక్కువగా ఆశిస్తాయి. నివారణకు 0.3 మి.లీ. ఇమిడాక్లోప్రిడ్ మందును లీటరు నీటికి కలిపి చల్లాలి.



- గొంగళి పురుగు ఆశించి కొనభాగాలను తిని ఈనెలను మిగులుస్తాయి. స్పైనోశాడ్ 0.3మి.లీ. లేదా సైపర్‌మెత్రిన్ 1 మి.లీ... లీటరు నీటికి కలిపి చల్లితే ఫలితం ఉంటుంది.

గులాబీ..: గులాబీ తోటలకు పెంకు పురుగులు ఆశించి రాత్రివేళ ఆకులు తిని నష్టం కలిగిస్తాయి. నివారణకు క్లోరిపైరిఫాస్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఆకులపై బూడిద తెగులు ఆశిస్తే బూడిద వంటి తెల్లటి పదార్థం ఏర్పడి ఆకులు ముడుచుకుంటాయి. నివారణకు ప్రొపికోనజోల్ 1 మి.లీ. లేదా డినోకాప్ 1 మి.లీ. మందు లీటరు నీటికి కలిపి చల్లాలి. ● ఎండు తెగులు ఆశించి మొక్క పైభాగం నుంచి కిందికి ఎండిపోతుంది. నివారణకు తెగులు సోకిన కొమ్మను కత్తిరించాలి. ఆయా చోట్ల కాపర్ ఆక్సీక్లోరైడ్ పేస్టును పూయాలి.

మల్లెపూలు..: ప్రస్తుతం మల్లె తోటలకు మొగ్గతొలుచు పురుగు ఆశిస్తోంది. పురుగు లార్వా మొగ్గలోకి చొచ్చుకెళ్లి తినేస్తుంది. నివారణకు మలాథియాన్ మందు 2 మి.లీ. లేదా థయాక్లోప్రిడ్ 1 మి.లీ. లేదా స్పైనోశాడ్ 0.3 మి.లీ. మందును లీటరు నీటికి కలిపి చల్లితే ఫలితం ఉంటుంది.



కనకాంబరం..: ఈ తోటలకు ప్రస్తుతం నులిపురుగులు ఎక్కువగా ఆశిస్తాయి. వీటి వల్ల ఆకులు ముడుచుకొని ఊదారంగుకు మారుతాయి. మొక్కలు గిడసబారుతాయి. నివారణకు 10కిలోల కార్బోఫ్యూరాన్ గుళికలు వేసి భూమిలో కలిపి నీరు పెట్టాలి. ఎకరాకు 200 కిలోల వేప పిండి వేయాలి. ఎండు తెగులు సోకి ఆకులు కిందికి వాలుతాయి. కాండం కుళ్లిపోతుంది. చివరకు మొక్కలు చనిపోతాయి. నివారణకు లీటరు నీటికి 2.5 గ్రా. మాంకోజెట్ లేదా 0.75 గ్రా. ట్రైఫ్లోక్సీస్ట్రోబిన్‌తో టెబుకోనజోల్‌ను కలిపి 20-25 మి.లీ. మందు ద్రావణంతో మొక్క మొదలు చుట్టూ నేల తడిసేలా చల్లాలి.

సాగులో సందేహాలా?

సంప్రదించాల్సిన ఫోన్ నం: 93815 15588

సాగు పద్ధతులు, చీడపీడల నివారణ, సస్యరక్షణపై రైతుల ప్రశ్నలకు సిద్దిపేట తోర్నాల వ్యవసాయ పరిశోధన కేంద్రం సమన్వయకర్త విజయ్ సమాధానాలు ఇచ్చారు.

ప్రశ్న: పత్తికి పచ్చ దోమ ఆశించింది. నివారణ చర్యలు తెలపండి?
– సుదర్శన్, చేగుంట

సమాధానం: 0.25 మి.లీ. ఇమిడాక్లోప్రిడ్, ఎసిఫేట్ 1.5 గ్రాములు, ఫిప్రోనిల్ 2 మి.లీ... లీటరు నీటికి కలిపి పిచికారీ చేస్తే ఫలితం ఉంటుంది.
– న్యూస్‌టుడే, చేర్యాల

పాటించు.. నివారించు..




వాతావరణంలో మార్పులతో కాకర తోటలకు చీడపీడలు ఆశించే అవకాశం ఉంది. పండు ఈగ ఆశించి నష్టపరుస్తుంది. సన్నని పురుగులు కాయ గుజ్జును తినేస్తాయి. నివారణకు లీటరు నీటిలో మలాథియాన్ 2 మి.లీ. కలిపి పిచికారీ చేయాలి. రాలిపోయిన కాయలను ఏరి కాల్చివేయాలి. ఎకరాకు 4 నుంచి 5 లింగాకర్షక బుట్టలు ఏర్పాటుచేయాలి. ● ప్రస్తుతం పాముపొడ పురుగు ఆశిస్తుంది. గొంగళి పురుగు మాదిరిగా ఉండి ఆకు పొరల్లో చొచ్చుకుపోతాయి. నివారణకు ప్రొఫెనోపాస్ 2 మి.లీ. మందును లీటరు నీటిలో కలిపి చల్లాలి. పూత వచ్చే వరకు 5 శాతం వేప గింజల కషాయాన్ని 15 రోజులకోసారి చల్లాలి.
- **న్యూస్‌టుడే, పాపన్నపేట**

పత్తిలో ఆకుమచ్చ తెగులా..

ఇటీవలి భారీ వర్షాల అనంతరం పత్తి పంటను ఆకు మచ్చ తెగులు, పిండినల్లి పురుగులు ఎక్కువగా ఆశిస్తున్నాయి. వీటి నివారణకు తగిన మోతాదులో మందులు వాడాలి. ఆకుమచ్చ తెగులు నివారణకు ప్లాంటో మైసీన్ లేదా స్ట్రెప్టోమైసిన్ 0.2 గ్రా., కాపర్ ఆక్సీక్లోరైడ్‌ను 3 గ్రా... లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. పిండినల్లి పురుగు నివారణకు లీటరు నీటికి 2 గ్రా.ఎసిఫేట్‌తో పాటు 1 మి.లీ. శాండోవిట్ జిగురు మందు కలిపి మొక్క తడిచేలా పిచికారీ చేయాలి.
– **జహీరాబాద్ అర్బన్**

సమయానుకూల సాగు.. లాభాలు బాగు





సమయం, డిమాండ్‌కు అనుగుణంగా పంటల సాగు లాభదాయకమని నిరూపిస్తున్నారు గుమ్మడిదల మండలం వీరన్నగూడెంకు చెందిన రాంచందర్. ఈయనకు రెండెకరాల పొలం ఉంది. ఇందులో సాధారణంగా వరితో పాటు కూరగాయలు సాగు చేస్తుంటారు. పండగలు సీజన్ వచ్చిందంటే మాత్రం పూల సాగు బాట పడతారు. ఏటా దసరా, దీపావళి, కార్తిక మాసం వచ్చే ముందు బంతి పూలు పండిస్తున్నారు. ఎకరా పొలంలో ఎర్ర, పసుపు పచ్చ రకాలను సాగు చేస్తున్నారు. నాణ్యమైన విత్తనాలు తెచ్చి నాటడంతో పాటు అన్ని రకాల సస్యరక్షణ చర్యలు తీసుకుంటున్నారు. నాటు వేసింది మొదలు పూత వచ్చే వరకు నిత్యం కంటికి రెప్పలా కాపాడుకుంటారు. పురుగులు ఆశించినట్లు గుర్తించగానే అధికారుల సూచనలతో మందులు పిచికారీ చేస్తున్నారు. విత్తనాలు, మందులు, ఇతరత్రా వాటికి ఎకరాకు రూ.50 వేల వరకు పెట్టుబడి అవుతోంది. దసరా నుంచి మొదలుకొని కార్తికమాసం చివరి వరకు నాలుగు కాతలు చేతికొస్తున్నాయి. ఒక్కో కాతకు ఎకరాకు 6 క్వింటాళ్ల మేర దిగుబడి వస్తోంది. మొత్తం సీజనలో 24 క్వింటాళ్ల మేర దిగుబడి సాధిస్తున్నారు. హైదరాబాద్, జిన్నారం, బొంతపల్లి మార్కెట్‌కు తరలించి విక్రయిస్తున్నారు. వీటి అమ్మకం ద్వారా రూ.లక్ష వరకు ఆదాయం ఆర్జిస్తున్నారు. పెట్టుబడి పోను రూ.50 వేల వరకు మిగులుతోంది. ఈ లెక్కన ఎకరాలో పూల సాగుతో రూ.2 లక్షల వరకు ఆర్జిస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలిచారు.
- **న్యూస్‌టుడే, గుమ్మడిదల**

పోలీసులు వచ్చె.. గ్రామస్థులు అడ్డుకునే..

గురువన్నపేటలో రెండో రోజూ ఉద్రిక్తత



నిందితుడి ఇంటిపై దాడి చేసిన వారిని పోలీసులు తీసుకెళ్తుండగా అడ్డుకుంటున్న గ్రామస్థులు

చేర్యాల, న్యూస్‌టుడే: బాలికపై అత్యాచారం ఘటన జరిగిన సిద్దిపేట జిల్లా చేర్యాల సర్కిల్ పరిధిలోని గురువన్నపేట గ్రామంలో రెండో రోజు సోమవారమూ ఉద్రిక్తత నెలకొంది. ఆదివారం నిందితుడి ఇంటికి నిప్పు పెట్టి, కారు ధ్వంసం చేసిన ఘటనలో కేసు నమోదైన నిందితులను అదుపులోకి తీసుకోవడానికి సోమవారం ఉదయం పోలీసులు గ్రామానికి వచ్చారు. వారిలో ఆరుగురిని వాహనంలో ఎక్కించుకొని తరలిస్తుండగా పోలీసు వాహనాలను గ్రామస్థులు అడ్డుకున్నారు. దారికి అడ్డంగా బైఠాయించారు. హుస్నాబాద్ ఏసీపీ సతీశ్, చేర్యాల సీఐ శ్రీను, ఎస్సై రాజు చేరుకొని సముదాయించే ప్రయత్నం చేశారు. ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు అదనపు బలగాలను రప్పించారు. అదుపులోకి తీసుకున్న వారిని వదిలిపెట్టాలని గ్రామస్థులు నినాదాలు చేశారు. గత్యంతరం లేక చివరకు వాహనాల్లో ఉన్న ఆరుగురిని పోలీసులు వదిలిపెట్టారు. అదనపు డీసీపీ మల్లారెడ్డి మాట్లాడుతూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకూడదన్నారు. అత్యాచార బాధిత కుటుంబాన్ని భాజపా మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి, జనగామ జిల్లా అధ్యక్షుడు దశమంతరెడ్డి, మహిళ విభాగం అధ్యక్షులు లక్ష్మి, బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి సురేశ్, నాయకులు పరామర్శించారు. నిందితుడికి కఠిన శిక్ష పడాలని వారు డిమాండ్ చేశారు.

అంత్యక్రియలకు వెళ్తూ ట్రాక్టర్ బోల్తా

ఒకరి దుర్మరణం పలువురికి గాయాలు

దౌల్తాబాద్: అంత్యక్రియలకు వెళ్తూ ట్రాక్టర్ బోల్తాపడి ఒకరు మృతి చెందగా, పలువురు గాయపడ్డారు. వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ ఎస్‌ఐ రవిగౌడ్ తెలిపిన వివరాలు.. మండలంలోని ఈర్లపల్లి నుంచి నాగసార్‌కు బంధువుల అంత్యక్రియల నిమిత్తం ట్రాక్టర్‌లో బయలుదేరారు. దేవర్‌పస్లావాద్ సమీపంలో ట్రాక్టర్ అదుపుతప్పి పొలంలోకి దూసుకెళ్లి బోల్తాపడింది. ఈర్లపల్లికి చెందిన మాల అమృతమ్మ (51) అక్కడికక్కడే మృతి చెందింది. మాల కిష్టప్ప, నర్సమ్మ, అచ్చన్న, కవిత, దస్తమ్మ, బామమ్మ, బనప్పలకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం ప్రైవేట్ వాహనాల్లో కొడంగల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధిత కుటుంబీకుడు లాలప్ప ఫిర్యాదుతో కేసు నమోదైంది.

కారు టైరు పేలి ఒకరు..

బొంరాస్‌పేట (కొడంగల్): వేగంగా వెళ్తున్న కారు టైర్ పేలడంతో ప్రమాదానికి గురై ఒకరు మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్‌ఐ రవూఫ్ తెలిపిన వివరాలు.. సోమవారం అర్ధరాత్రి ఒంటి గంట ప్రాంతంలో హైదరాబాద్ నుంచి కర్ణాటకలోని మల్కేడ్‌కు బయల్దేరిన ఓ కారు బొంరాస్‌పేట చెరువు మలుపు వద్ద టైర్ పేలి అదుపు తప్పి ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టింది. కారులో ప్రయాణిస్తున్న విశ్వనాథ్ (49) అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరు.. రవికుమార్, రవిచంద్రలకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని హైదరాబాద్‌కు తరలించారు. మృతుడు మల్కేడ్ వాసిగా గుర్తించారు. భాస్కర్‌రావు ఫిర్యాదుతో కేసు నమోదైంది.


బైక్‌తో చెట్టును ఢీకొని మేస్త్రీ..

వెల్దుర్తి: అతివేగంగా ద్విచక్ర వాహనంపై వస్తూ అదుపుతప్పి చెట్టుకు ఢీకొట్టి ఓ వ్యక్తి మృతి చెందాడు. మెదక్ జిల్లా వెల్దుర్తి ఏఎస్‌ఐ సాదత్‌మియా తెలిపిన వివరాలు.. కర్నూల్ జిల్లా ఎమునూర్‌కు చెందిన కట్ల రమేష్(35) మండలంలోని మానేపల్లిలో ఉంటూ మేస్త్రీగా పని చేస్తున్న అదే జిల్లాకు చెందిన పాలపర్తి శ్రీనివాస్ వద్దకు పది రోజుల క్రితం వచ్చాడు. అతడి వద్ద పనికి చేరాడు. సోమవారం మానేపల్లి పక్క గ్రామం అందుగులపల్లికి పని నిమిత్తం వెళ్లాడు. సాయంత్రం ద్విచక్రవాహనంపై తిరిగి బయల్దేరాడు. వేగంగా వస్తూ అందుగులపల్లి శివారులో ఓ చెట్టుకు ఢీకొట్టి పడిపోగా తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలికి వెళ్లి పరిశీలించారు. మృతుడు రమేష్ వివరాల కోసం శ్రీనివాస్‌ను అడగ్గా భార్యాపిల్లలు ముంబయిలో ఉంటారని, వారి చిరునామా తెలియదని చెప్పాడు. ఇంకా ఫిర్యాదు అందలేదని, రాగానే కేసు నమోదు చేస్తామని ఏఎస్‌ఐ వివరించారు.

బాలిక మరణానికి కారణమైన.. దంపతులకు జీవిత ఖైదు

సంగారెడ్డి అర్బన్: ఐదేళ్ల బాలికను చిత్రహింసలకు గురిచేసి మరణానికి కారణమైన దంపతులకు జీవిత ఖైదు విధిస్తూ ఫ్యామిలీ కోర్టు నాలుగో సెషన్స్ కోర్టు న్యాయమూర్తి కోట్ల లావణ్య బాల్‌రెడ్డి సోమవారం తీర్పు ఇచ్చిందని సంగారెడ్డి ఎస్పీ రూపేష్ తెలిపారు. కొండాపూర్ మండలం మల్కాపూర్‌లోని గాంధీనగర్‌కు చెందిన సయ్యద్ జకీర్ అహ్మద్ హెడ్ కానిస్టేబుల్. గతంలో ఐడీఏ బొల్లారంలో పని చేశాడు. సతీమణి రజియా సుల్తానాతో కలిసి కొండాపూర్‌లో నివాసం ఉన్నాడు. వారింట్లో ఐదేళ్ల బాలికను పనిలో పెట్టుకున్నారు. పని సరిగా చేయ లేదని బాలికను చితకబాదగా.. అపస్మారకస్థితికి చేరింది. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. 2015, జనవరి 29న ఈ ఘటన జరిగింది. ఛైల్డ్ హెల్ప్‌లైన్ అధికారి ఎం.ఎస్. చంద్ర కొండాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో వివరాలు సమర్పించారు. పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి దంపతులిద్దరికీ జీవితఖైదు విధించారు.

రెండోసారి ఆత్మహత్యాయత్నం.. చికిత్స పొందుతూ మృతి



మంగవ్వ

దుబ్బాక: ఆర్నెల్ల క్రితం బావి వద్దకు వెళ్లి ఆత్మహత్య చేసుకుంటానని ఓ వృద్ధురాలు యత్నించగా కుటుంబ సభ్యులు కాపాడారు. సెప్టెంబరు 22న ఆమె మద్యం మత్తులో గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. సిద్దిపేట జిల్లా దుబ్బాక ఎస్‌ఐ వి.గంగరాజు తెలిపిన వివరాలు.. మండలంలోని అప్పనపల్లికి చెందిన గ్యార మైసయ్య కూలీ పనులు చేస్తూ, భార్య మంగవ్వ (66), ఇద్దరు కుమారులతో కలిసి జీవనం కొనసాగిస్తున్నాడు. మంగవ్వకు మద్యం తాగే అలవాటుంది. సెప్టెంబరు 22న బంధువు అంత్యక్రియలకు వెళ్లి, మద్యం తాగి ఇంటికి వచ్చింది. కుటుంబీకులతో గొడవపడింది. గడ్డి మందు తాగింది. కుటుంబీకులు గుర్తించి 108 వాహనంలో సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి, మెరుగైన చికిత్సకు హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. మైసయ్య ఫిర్యాదుతో కేసు నమోదైంది.

పంపుహౌస్ ప్రైవేటు ఇంజినీర్ ఆత్మహత్య



వెంకటేశ్

గజ్వేల్ గ్రామీణ: కొండపోచమ్మ సాగర్‌కు సంబంధించిన పంపుహౌస్ వద్ద ఇంజినీర్‌గా పని చేస్తున్న యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. సిద్దిపేట జిల్లా మక్తమాసాన్‌పల్లికి చెందిన చింత వెంకటేశ్ (26)కు భార్య శిరీష, ఏడాదిన్నర వయసున్న కుమారుడు ఉన్నారు. గజ్వేల్ మండలం అక్కారం శివారు పంపుహౌస్‌లో ప్రైవేటు కంపెనీలో ఇంజినీర్‌గా పని చేస్తున్నాడు. సోమవారం విధులకు హాజరైన వెంకటేశ్.. తోటి ఉద్యోగులు రమ్మని పిలిచినా మధ్యాహ్న భోజనానికి వెళ్లలేదు. అందరూ భోజనానికి వెళ్లగానే తాను ఉన్న గదిలోనే ఉరేసుకున్నాడు. తోటివారు వచ్చి కిందికి దించి గజ్వేల్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే వెంకటేశ్ మృతి చెందినట్లు వైద్యులు తేల్చిచెప్పారు. ఈ ఘటనపై ఫిర్యాదు రాలేదని గజ్వేల్ సీఐ సైదా తెలిపారు. ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు.

మందులు, ఎరువులు అధికంగా వాడొద్దు



గంగారంలో పంట పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు

బషీరాబాద్: వర్షాలకు కంది, పత్తి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. నష్ట నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, తాండూరు కంది పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు సూచనలు, సలహాలు అందించారు. క్యాద్గీర, గంగ్వార్, నవాంద్గిలో అధికారుల బృందం పర్యటించింది. ఎక్కువ మోతాదులో మందులు, ఎరువులు వాడొద్దన్నారు. రాజేంద్రనగర్ ప్రధాన శాస్త్రవేత్తలు డా.ఆర్.రాంగోపాల్‌వర్మ, డా.వై.చంద్రమోహన్, డా.టి.కిరణ్ బాబు, తాండూరు ఏరువాక కేంద్రం సమన్వయకర్త టి.లక్ష్మణ్, శాస్త్రవేత్త యమున, ఏడీఏ రుద్రమూర్తి, మండల వ్యవసాయాధికారి సూర్యప్రకాశ్ ఉన్నారు.

యాలాల: వరిలో విస్తరిస్తున్న కాండం తొలిచే పురుగు, అకుముడత పురుగుల నివారణకు రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని శాస్త్రవేత్త డాక్టర్ రాంగోపాల్ అన్నారు. సోమవారం యాలాల మండల కేంద్రంతోపాటు విశ్వనాథ్‌పూర్, చెన్నారం, బషీరాబాద్ మండలంలోని ఖాసీంపూర్‌లో పత్తి, కంది వరి పొలాలను నేరుగా పరిశీలించి మాట్లాడారు.

క్రీడల్లో రాణిస్తే భవిష్యత్తు

కార్ఖానా: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ తెలిపారు. గిరిజన ఆశ్రమ పాఠశాలల జోనల్ స్థాయి పోటీలను సోమవారం బోయిన్‌పల్లి క్రీడా మైదానంలో బోర్డు సీఈవో మధుకర్‌నాయక్‌తో కలిసి ప్రారంభించారు. పోటీల్లో వికారాబాద్, మేడ్చల్, మెదక్, సిద్ధిపేట, సంగారెడ్డి, రంగారెడ్డి, హైదరాబాద్, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు పాల్గొంటున్నారని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కోటాజీ తెలిపారు.

పచ్చదనం పరచుకుంటోంది..

న్యూస్‌టుడే, పూడూరు

మన్నెగూడ, పరిగి వైపు హైదరాబాద్, బీజాపూర్ జాతీయ రహదారిలో ఒకప్పుడు పచ్చదనం వెల్లివిరిసేది. నీడనిచ్చే వాటితోపాటు పండ్లు, పూల చెట్లు ఆకర్షించేవి. దూర ప్రాంతాల నుంచి వచ్చిపోయే వాహనదారులు కొద్దిసేపు నీడలో సేదతీరేవారు. సీజన్‌లో వచ్చే పండ్లను ఆరగించేవారు. రహదారి విస్తరణలో భాగంగా చెట్లు తొలగించటంతో నీడ కరవైంది. ఇప్పుడిప్పుడే తిరిగి పచ్చదనం పరుచుకుంటోంది. హరిత హారం అమలుపై జాతీయ రహదారుల సంస్థ ప్రత్యేకంగా దృష్టి సారించింది.



మన్నెగూడ సమీపంలో మొక్కలు నాటుతున్న కూలీలు

నరికేసిన చెట్ల స్థానంలో మొక్కలు..

హైదరాబాద్- బీజాపూర్ జాతీయ రహదారిలో ప్రమాదాల నివారణకు ఆరేళ్ల కిందట అధికారులు విస్తరణకు ప్రతిపాదించారు. నిధులు మంజూరు కావడంతో మన్నెగూడ నుంచి పరిగి మీదుగా కొడంగల్ శివారులోని జిల్లా సరిహద్దు వరకు దాదాపు 70 కి.మీ. మేర రహదారి విస్తరించారు. ఏళ్ల కిందట ఇరువైపులా నాటిన మామిడి, కానుగ, నేరేడు, అల్ల నేరేడు, మద్ది, మర్రి, వెదురు చెట్లు తొలగించారు. అనేక ప్రదేశాల్లో ప్రమాదకరంగా మారిన మలుపులను తగ్గించేందుకు ఇంజినీర్లు మార్కింగ్ వేయడంతో అదనంగా మరికొన్ని చెట్లు నరికేశారు. రహదారి నిర్మాణం పూర్తయినా ఇరువైపులా చెట్లు లేక బోసిపోయింది. జాతీయ రహదారుల సంస్థ ఆధ్వర్యంలో సంబంధిత గుత్తేదారు.. నరికిన చెట్ల స్థానంలో పెద్ద మొత్తంలో మొక్కలు నాటిస్తున్నారు. ప్రారంభంలో నాటినవి ఇప్పటికే కొన్ని పెద్దవి కావడంతోపాటు మరికొన్ని ఇప్పుడిప్పుడే ఎదుగుతున్నాయి. ఎక్కువగా మర్రి, పూలు, పండ్లను ఇచ్చే రకాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. నాటిన మొక్కలకు ట్యాంకరు ద్వారా నీరందిస్తూ సంరక్షిస్తున్నారు.

గ్రామాల్లోనూ అమలు..

ఉపాధిహామీ పథకంలో భాగంగా పల్లెల్లో వర్షాకాలం హరితహారం జోరుగా సాగింది. మొక్కలకు నీరందించేందుకు అక్కడక్కడా కొన్ని ఇబ్బందులు వచ్చినా అధిగమించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. పంచాయతీ ట్రాక్టర్ ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయించారు. పరిగి, కొడంగల్, తాండూరు, వికారాబాద్ నియోజకవర్గాల పరిధిలో 566 నర్సరీలుండగా. ఈసారి 30 లక్షల మొక్కలు నాటాలని నిర్ణయించారు. ఉపాధిహామీ కూలీలతో గ్రామాల్లో మొక్కలు నాటాల్సిన చోట గుంతలు తీయించారు. వెంటనే మొక్కలు నాటించారు. ప్రస్తుతం ట్రీగార్డులు ఏర్పాటు చేస్తున్నారు.

జాతీయ రహదారి వెంబడి నాటుతున్న మొక్కలు

లక్ష్యం పూర్తి చేయించాం..

– రాములు, ఏపీవో, పూడూరు

ఈసారి వర్షాలు ఆశాజనకంగా కురవడంతో అవసరమున్న చోట మొక్కల లక్ష్యం పూర్తి చేయించాం. రహదారులకు ఇరువైపులా, పల్లెల్లో ఎక్కడ ఖాళీ స్థలాలున్నా తప్పనిసరిగా మొక్కలు నాటించాం. ప్రస్తుతం సంరక్షణ పనులు చేయిస్తున్నాం. ప్రతి ఒక్కరూ సహకరించాలి. బీజాపూర్ జాతీయ రహదారిలో సబంధిత గుత్తేదారు నిర్వహణ చూసుకుంటున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

వికారాబాద్‌టౌన్: 80742 74587
తాండూరు టౌన్: 80085 73260
పరిగి : 80085 73272
కొడంగల్: 94403 34770
(10 AM TO 1 PM)

న్యూస్‌టుడే, తాండూరు టౌన్, కుల్కచర్ల, ధారూర్

? పుర పరిధి తెలుగుగడ్డ ప్రాంతంలోని వీధుల్లో మురుగు కాల్వలు పూర్తి స్థాయిలో శుభ్రం చేయడం లేదు. - రమేశ్, తాండూరు

✔ మురుగు కాల్వలు పూర్తిస్థాయిలో శుభ్రం చేయడానికి చర్యలు తీసుకుంటాం. – విక్రమ సింహారెడ్డి, పుర కమిషనరు

? మండల కేంద్రంలో చాలాచోట్ల మురుగు కాలువల్లేక ఇబ్బందులు తప్పడం లేదు. - కృష్ణయ్య, కుల్కచర్ల

✔ ఎక్కడెక్కడ అవసరమో పరిశీలిస్తాం. నిధుల లభ్యత ఆధారంగా అవసరమైన చోట్ల మురుగు కాలువల నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం. – మురళీధర్, ప్రత్యేకాధికారి

? దోర్నాల్ నుంచి అంపల్లి కూడలి వరకు రోడ్డు కంకర తేలి గుంతలు ఏర్పడ్డాయి. నిత్యం ఇబ్బందులు పడుతున్నాం.

– మల్లేశ్, అంపల్లి

✔ తారు రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాం. నిధులు రాగానే పనులు ప్రారంభిస్తాం.

– ప్రణీత్, పంచాయతీరాజ్ శాఖ ఏఈ

రైతును రాజుగా చేయడమే ప్రభుత్వ లక్ష్యం

యాలాల, న్యూస్‌టుడే: రాష్ట్రంలో రైతును రాజుగా చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్‌రెడ్డి అన్నారు. సోమవారం యాలాల మండల కేంద్రంలో రూ.32లక్షలతో నిర్మించిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, బ్యాంక్ సహకార సంఘం ఛైర్మన్ సురేందర్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. డీసీసీబీ వైస్ ఛైర్మన్ రవి గౌడ్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ

దౌల్తాబాద్, కొడంగల్, బొంరాస్‌పేట: స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయమని జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ రాజేశ్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన బొంరాస్‌పేట మండలం చౌదర్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో అంకిత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, సంచులు, చెప్పులు అందించారు. ప్రకాశ్, నారాయణరెడ్డి ఉన్నారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు

వికారాబాద్ మున్సిపాలిటీ: ప్రభుత్వ ఉద్యోగులు అంకితభావంతో విధులు నిర్వహిస్తే గుర్తింపు ఉంటుందని పుర అధ్యక్షురాలు మంజుల అన్నారు. సోమవారం పురపాలక సమావేశ మందిరంలో టౌన్‌ప్లానింగ్ అధికారి కౌకుంట్ల శరభలింగం పదవీ విరమణ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పుర కమిషనర్ జాకీర్ అహ్మద్, పట్టణ ప్రణాళికాధికారి వేణుగోపాల్, డీఈ రాకేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించండి

మర్పల్లి, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎస్‌సీఈఆర్టీ రాష్ట్ర పరిశీలకుడు మహ్మద్ యాసిన్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్తు ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు నిర్వహిస్తున్న న్యాస్ నమూనా పరీక్షలు పరిశీలించారు.

నైపుణ్యాలు పెంచేలా బోధన

పెద్దేముల్: విద్యార్థులు భాషా నైపుణ్యాలపై పట్టు సాధించేలా బోధించాలని మండల విద్యాధికారి నర్సింగ్‌రావు తెలిపారు. సోమవారం మండలంలోని గొట్లపల్లి, గాజీపూర్ పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు.

డీఎస్సీలో సత్తా

కొడంగల్, బొంరాస్‌పేట: మండలంలోని నాందార్‌పూర్‌కు చెందిన నలుగురు డీఎస్సీలో ప్రతిభ కనబరిచారు. పెద్ద వెంకటప్ప, ఎమ్.వేణుగోపాల్, అన్నదమ్ములు కుంబళ్ల రాఘవేంద్ర, ఆయన తమ్ముడు కుంబళ్ల నరేశ్, లగచర్లకు చెందిన కావలి రమేశ్ సత్తా చాటారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



చిన్నారులను ఆశీర్వదిస్తున్న పెద్దలు

పూడూరు, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రాల్లో లభించే పోషకాహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలని మండల సూపర్‌వైజర్ కళావతి తెలిపారు. పూడూరు నంబరు 3 అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం మండల స్థాయి పోషణమాసం ముగింపు ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మొలకెత్తిన విత్తనాలు, పండ్లు, పూలను ప్రదర్శించారు. పెద్దవారితో చిన్నారులకు ఆశీర్వాదం ఇప్పించారు.

దౌల్తాబాద్, బొంరాస్‌పేట: చిన్నారులకు పోషకాహారం అందించాలని ఎర్రుమల్ల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వెంకట్‌రెడ్డి సూచించారు. అంగన్‌వాడీ ఆధ్వర్యంలో నిర్వహించిన పోషణ మాసంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో పర్యవేక్షకురాలు మంజుల, వైద్యాధికారి అక్షయ్ పాల్గొన్నారు.

బషీరాబాద్: పౌష్టికాహారంపై అవగాహన ఉండాలని బషీరాబాద్ అంగన్వాడీ పర్యవేక్షకురాలు జ్యోతి తెలిపారు. సోమవారం పౌష్టికాహార ఉత్సవాన్ని నిర్వహించారు. పప్పు దినుసులు, ఆకుకూరలు ప్రదర్శించారు.

చట్టాలపై అవగాహన అవసరం



కమాల్‌పూర్‌లో మాట్లాడుతున్న ఎస్సై శంకర్

యాలాల, న్యూస్‌టుడే: దేశంలోని చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్సై శంకర్ అన్నారు. సోమవారం మండలంలోని కమాల్‌పూర్‌లో పౌరహక్కుల దినోత్సవంలో భాగంగా గ్రామస్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఎస్సీ వసతిగృహ అధికారి వీరానందం, ఆర్ఐ శివచరణ్, జూనియర్ సహాయకులు వెంకటయ్య, శ్రీనివాస్ ఉన్నారు.

కొడంగల్, బొంరాస్‌పేట: కొత్తూర్ గ్రామంలో సోమవారం పౌరహక్కుల గురించి ఎస్సై రవూఫ్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఎస్సైతో పాటు పాల్గొన్న ఆర్ఐ శిరీషా ఇరువురు కలిసి గ్రామంలో పౌరహక్కులను కాపాడుతామని ప్రతిజ్ఞ చేయించారు.

కుల్కచర్ల: అందరూ సమానమేనని, కలిసి మెలిసి జీవించడం ద్వార ప్రయోజనం ఉంటుందని తహసీల్దార్ మురళీధర్ అన్నారు. మండలంలోని చాపలగూడెంలో పౌరహక్కుల దినం నిర్వహించారు.

నీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ



సూచనలిస్తున్న ఎస్ఈ ఆంజనేయులు

పరిగి గ్రామీణ, దోమ: నీటి సరఫరాలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎస్ఈ ఎం.ఆంజనేయులు అన్నారు. పంచాయతీ మల్టీపర్పస్ వర్కర్లకు సోమవారం దోమ ఎంపీడీవో కార్యాలయంలో నాలుగు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. చేతి పంపుల మరమ్మతులు, నీటిశుద్ధిపై సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈఈ చల్మారెడ్డి, ఎంపీడీవో మహేష్‌బాబు, ఏఈ కిరణ్, ఎంపీవో సోమలింగం, సిబ్బంది, కార్యదర్శులు పాల్గొన్నారు.

బంట్వారం: మిషన్ భగీరథ నీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చూసుకోవాలని ఎంపీడీవో రాములు అన్నారు. మండల పరిషత్తు కార్యాలయంలో వాటర్ మాన్, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ ఏఈ వేణుగోపాల్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వృద్ధులపై సానుకూలంగా ఉండండి

తాండూరు గ్రామీణ: వృద్ధులతో సానుకూలంగా, అప్యాయతతో మసులుకోవాలని స్త్రీ శిశు సంక్షేమ శాఖ సహాయ సీడీపీవో శ్రీలక్ష్మి సూచించారు. మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సహాయ సీడీపీవో మాట్లాడుతూ.. వృద్ధులను ఆదరించి గౌరవంతో మెలగాలన్నారు.

నవాబుపేటలో భారీ వర్షం

నవాబుపేట: ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి జనజీవనం స్తంభించింది. మండల పరిధిలోని పులుమామిడిలో దిగువనున్న పలు ఇళ్లల్లోకి వరద చేరింది. సోమవారం ఉదయం సంబంధిత అధికారులు వచ్చి వరద రాకుండా పొక్లెయిన్‌తో చర్యలు చేపట్టారు.

ఉత్సాహంగా బతుకమ్మ సంబరాలు

దౌల్తాబాద్, కొడంగల్: తెలంగాణ సాంప్రదాయం ఉట్టిపడేలా కొడంగల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థినులు బతుకమ్మలతో ఆడిపాడారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి వాటి చుట్టూ తిరిగారు.

తపస్ మండల కార్యవర్గం ఎన్నిక

దౌల్తాబాద్, బొంరాస్‌పేట, కొడంగల్: తపస్ మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు అంజిరెడ్డి తెలిపారు. సోమవారం కొడంగల్‌లో జరిగిన ఉపాధ్యాయ కార్యవర్గ సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడారు. మండల అధ్యక్షుడిగా శంకరప్ప, ప్రధాన కార్యదర్శిగా తేజస్విని, ఉపాధ్యక్షుడిగా అశోక్‌కుమార్, కార్యదర్శిగా అంజిలయ్య, కోశాధికారిగా దిలీప్‌కుమార్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు. పలువురు పాల్గొన్నారు.

తండాలకు వెళ్లే రోడ్లు బాగు చేయరూ..

కుల్కచర్ల గ్రామీణ: తండాలకు వెళ్లే రోడ్లను బాగు చేయాలని మండల గిరిజన సంఘం నాయకులు తులసీరాం, తుల్జానాయక్, రాజునాయక్ ఓ ప్రకటనలో తెలిపారు. కురుస్తున్న వర్షాలకు తండాలకు వెళ్లే రోడ్లన్నీ అధ్వానంగా మారాయన్నారు. దీంతో రాకపోకలకు చాలా ఇబ్బందులు కలుగుతున్నాయని వాపోయారు.

ఉత్తమ సేవలతో గుర్తింపు

తాండూరుగ్రామీణ: ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించి గుర్తింపు పొందాలని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా సహకార సంఘాల ఉపాధ్యక్షులు రవీందర్‌గౌడ్ ఆకాంక్షించారు. పెద్దేముల్ మండలానికి బదిలీపై వెళ్లిన ఎంపీఓ రతన్‌సింగ్‌తోపాటు, బదిలీ అయిన పంచాయతీ కార్యదర్శులకు సోమవారం సాయంత్రం తాండూరు మండల పరిషత్ కార్యాలయంలో వీడ్కోలు సభ నిర్వహించారు. ఉపాధ్యక్షుడి చేతుల మీదుగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు.

పూడూరు: మండలంలోని ఎన్కెపల్లి ఆదర్శ పాఠశాలలో పని చేసి ఇటీవల బదిలీపై వెళ్లిన ప్రిన్సిపల్ శ్రీదేవి, ఉపాధ్యాయుల వీడ్కోలు సభను సోమవారం పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు పూలు చల్లుతూ ఉపాధ్యాయులను ఒక్కొక్కరిని వేదికపైకి తీసుకొచ్చారు. పూలమాలలు వేసి, శాలువాలు కప్పి ఘనంగా సత్కరించి జ్ఞాపిక అందించారు. అనంతరం కొత్తగా వచ్చిన ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు సురేందర్, మాజీ సర్పంచి రాములు తదితరులు ఉన్నారు.

కాగ్నా నదిలో పడి ఒకరి మృతి

బషీరాబాద్: ప్రమాదవశాత్తు కాగ్నా నదిలో పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన బషీరాబాద్ మండలం జీవన్గిలో చోటుచేసుకుంది. ఎస్ఐ గఫర్ తెలిపిన ప్రకారం గ్రామానికి చెందిన మొగులప్ప(35) వ్యవసాయ కూలి పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి భార్య చంద్రకళ, కూతురు ఉన్నారు. శనివారం ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన మొగులప్ప ఇంటికి రాలేదు. సోమవారం ఉదయం గ్రామ శివారులోని కాగ్నా నది నీటిలో శవమై తేలాడు. కాలకృత్యాలకు నది వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు మరణించారని కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తెలిపారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

యాలాల: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను మండలంలోని అచ్చుతాపూర్ సమీపంలో సోమవారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. కమాల్‌పూర్ మీదుగా అచ్చుతాపూర్ సమీపంలో అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నారు. విశ్వనీయ సమాచారంతో తనిఖీలు చేయగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని ఠాణాకు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

లారీ, ద్విచక్రవాహనం ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలు

యాలాల: లారీ, ద్విచక్రవాహనం ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై శంకర్ తెలిపిన వివరాలు.. బొంరాస్‌పేట్ మండలం బండమీది తండాకు చెందిన అనిల్‌కుమార్ రాథోడ్ కుటుంబం బతుకుదెరువుకు తాండూరుకు వచ్చింది. ఎప్పటిలాగానే రైస్ మిల్లు సమీపంలో పని ముగించుకొన్న అనిల్‌కుమార్ తాండూరు వైపు వస్తున్నాడు. పట్టణంలోని ఫ్లైఓవర్ సమీపంలో సిమెంట్ లారీ ఢీకొంది. ద్విచక్రవాహనం లారీ కిందికి వెళ్లి నుజ్జయింది. అనిల్‌కుమార్ రాథోడ్ కుడి కాలి చర్మం పూర్తిగా ఊడిపోయింది. స్థానికులు క్షతగాత్రుణ్ని తాండూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కణ్నుంచి మెరుగైన చికిత్సకు హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. కేసు నమోదైంది.

మరో ఘటనలో ఇద్దరికి..

పరిగి గ్రామీణ, న్యూస్‌టుడే: రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరికి గాయాలయ్యాయి. కుల్కచర్ల మండలం తిరుమలాపూర్ ఎర్రలచ్చ తండాకు చెందిన పి.కిషన్‌నాయక్ ద్విచక్ర వాహనంపై పరిగి వైపు వెళుతున్నాడు. యాలాల్ మండలం అచ్యుతాపూర్‌కు చెందిన ఆంజనేయులు ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. మండల పరిధిలోని పరిగి- షాద్‌నగర్ రహదారిపై లక్ష్మీదేవిపల్లి స్టేజీ దగ్గర వాహనాలు ఢీకొన్నాయి. ఇద్దరు వాహనదారులు గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్సకు పరిగి ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి తరలించారు. ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

రుణ ఖాతాలు రెన్యువల్ చేసుకుంటేనే ప్రభుత్వ ఫలాలు



పెద్దేముల్: మాట్లాడుతున్న సొసైటీ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి

రైతులు తీసుకున్న అప్పులను ఏడాదికోసారి రెన్యువల్ చేసుకుంటేనే ప్రభుత్వ ఫలాలు అందుతాయని పెద్దేముల్ రైతుసేవా సహకార సంఘం అధ్యక్షుడు ద్యావరి విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రుణమాఫీ కాని రైతుల జాబితాను ఉన్నతాధికారులకు పంపామన్నారు. తాండూరు ఎస్‌బీఐ మేనేజరు శ్రీనివాస్ మాట్లాడుతూ.. సంఘం మనుగడ సాగించాలంటే రుణాలు సకాలంలో చెల్లించాలన్నారు. కార్యక్రమంలో కోట్‌పల్లి వ్యవసాయ విపణి ఉపాధ్యక్షుడు నారాయణరెడ్డి, డైరెక్టర్లు రవి శంకర్, బస్వరాజ్, దస్తప్ప, గేమ్యా, పద్మమ్మ, సీఈవో మురళీధర్, మెంటయ్య, ప్రవీణ్‌కుమార్, ఫయాజ్ పాల్గొన్నారు. పరిగి ప్రాథమిక సహకార సంఘం ఛైర్మన్ కె.శ్యాంసుందర్‌రెడ్డి సర్వసభ్య సమావేశంలో పాల్గొని మాట్లాడారు. మండల సొసైటీ ఉపాధ్యక్షుడు ఎస్.భాస్కర్, సీఈవో అమరేందర్‌రెడ్డి, డైరెక్టర్లు దామోదర్‌రెడ్డి, శ్రీనివాస్, భోజ్యానాయక్, మాణిక్యం, నర్సిములు, రాంరెడ్డి పాల్గొన్నారు. నవాబుపేట మండల కేంద్రంలో పీఏసీఎస్‌లో ఛైర్మన్ పోలీస్ రామ్ రెడ్డి, సీఈవో మోహన్‌రెడ్డి, డైరెక్టర్లు, పూడూరులో సొసైటీ ఛైర్మన్ సతీష్‌రెడ్డి, వైస్ ఛైర్మన్ వీరయ్యగౌడ్, సీఈవో ఖలీల్, మోమిన్‌పేటలో పీఏసీఎస్ అధ్యక్షుడు బండ విష్ణువర్ధన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు రాంచంద్రారెడ్డి, కార్యదర్శి శేఖర్, బషీరాబాద్‌లో సహకార సంఘం అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి, ఉపాధ్యక్షుడు అజయ్ ప్రసాద్, సంఘం సభ్యులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే బృందం

వాతావరణ పరిరక్షణకు సమష్టి కృషి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీడీవో విజయలక్ష్మి

మోమిన్‌పేట: విద్యతోపాటు వాతావరణ పరిరక్షణ, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన పెంచుకోవాలని ఎంపీడీవో విజయలక్ష్మి విద్యార్థులకు సూచించారు. సోమవారం స్వచ్ఛతాహీ సేవలో భాగంగా మోమిన్‌పేట బాలుర ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

కుల్కచర్ల గ్రామీణ: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని ఎంపీడీవో రామకృష్ణ నాయక్ అన్నారు. స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా ముజాహిద్‌పూర్ ఉన్నత, ఆదర్శ పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. హెచ్‌ఎంలు జనార్దన్‌రెడ్డి, జ్యోతి హెప్సిబా, పంచాయతీ కార్యదర్శి సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

‘శిథిలం’.. భయం భయం

న్యూస్‌టుడే- కుల్కచర్ల గ్రామీణ, కుల్కచర్ల



ముజాహిద్‌పూర్‌లో బీసీ వసతిగృహ భవనం

శిథిలావస్థకు చేరిన భవనాలపై అధికారులు ఏమాత్రం దృష్టి సారించడం లేదు. కొన్నిచోట్ల అలాగే వినియోగిస్తుండగా.. మరికొన్ని చోట్ల దిష్టిబొమ్మల్లా తయారయ్యాయి. పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల పక్కనే ఉండడంతో భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. కూలి పక్కనే ఉన్న భవనాలపై పడితే ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశముంది.

ఉమ్మడి మండలంలో..

ఉమ్మడి కుల్కచర్ల మండలంలో 44 పంచాయతీలున్నాయి. వాటిలో గిరిజన తండాలే ఎక్కువ. కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల్లో సమస్య వేధిస్తోంది. భవనాల పైకప్పులు ఊడిపోయాయి. కొద్దిపాటి వర్షాలకే భవనంపై నీరు చేరి గదుల్లోకి వస్తోంది. దీంతో వసతిగృహాల్లో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీయాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. అధికారుల హామీలన్నీ మాటలకే పరిమితమవుతున్నాయి. శిథిల భవనాలను కూల్చాలని ఆదేశాలున్నా.. అమలు చేయడంలో స్థానిక అధికారులు విఫలమవుతున్నారు. దీంతో సమస్యల మధ్యనే కాలం వెళ్లదీయాల్సి వస్తోందని విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు. అధికారులు ఇకనైనా దృష్టి సారించి శిథిలావస్థకు చేరిన పాఠశాల, వసతిగృహ భవనాలను తొలగించి కొత్తవి నిర్మించేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

దృష్టి సారిస్తేనే మేలు..

శిథిలావస్థకు చేరిన వసతిగృహ, పాఠశాలల భవనాలపై అధికారులు దృష్టి సారించాల్సిన అవసరముంది. వర్షాలు కురుస్తుండడంతో కూలిపోయే అవకాశముంది. తాత్కాలిక ప్రాతిపదికన భవనాల మరమ్మతులైనా చేయించాలని పలువురు కోరుతున్నారు. అంతారం బీసీ బాలుర వసతిగృహం శిథిలావస్థకు చేరింది. భవనం పైకప్పు పెచ్చులూడాయి. దీప్లానాయక్‌తండా ప్రాథమిక పాఠశాల ఆవరణలో భవనం అవసాన దశకు చేరింది. సాల్వీడ్ ప్రాథమిక పాఠశాలలో శిథిలావస్థకు చేరిన గదులను తొలగించాలని కోరుతున్నారు. కుల్కచర్ల బీసీ బాలుర వసతిగృహం పూర్తి శిథిలావస్థకు చేరింది. పైకప్పు పెచ్చులూడిపడిపోతున్నాయి. భవనాన్ని అలాగే కొనసాగిస్తున్నారు. చాకల్‌పల్లితండాలో పాఠశాల భవనం పక్కనే గది శిథిలావస్థకు చేరింది. ముజాహిద్‌పూర్ బీసీ బాలుర వసతిగృహంలో కొద్దిపాటి వర్షాలకే గదుల్లోకి వర్షపు నీరు, తేమ వస్తోంది. విద్యార్థులు ఉంటున్న గదుల్లో భవనం పైకప్పు పెచ్చులూడింది.

ప్రమాదకరంగా ఉన్న వాటిపై దృష్టి సారిస్తాం..

- రామకృష్ణానాయక్, ఎంపీడీవో

శిథిల భవనాల సమస్యపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తాం. మండలంలో అక్కడక్కడా ఉన్నాయి. ముఖ్యంగా వసతిగృహాలు శిథిలావస్థకు చేరాయి. పాఠశాలల పక్కనే ఉన్నవాటిని తొలగించాలని గతంలోనే సూచించాం. కొన్నింటిని తొలగించారు. వర్షాలు కురుస్తున్నందున వాటిలో ఉండరాదని సూచించాం.

అడవిని ధ్వంసం చేయకండి

పూడూరు, న్యూస్‌టుడే: తెలంగాణలో ప్రాణవాయువును అందిస్తున్న దామగుండం అడవిని ధ్వంసం చేయరాదని టీపీటీఎల్‌ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ విజయ్‌కుమార్ కోరారు. పూడూరు మండల కేంద్రంలో స్థానికులతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిగ్నల్ వ్యవస్థ ఏర్పాటుతో పర్యావరణం దెబ్బతింటుందన్నారు. కార్యక్రమంలో నర్సిములు, రాములు, ప్రకాశం ఉన్నారు.

ఉపాధ్యాయుల పక్షాన నిలబడేది యూటీఎఫ్ మాత్రమే

తాండూరుగ్రామీణ, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ సమస్యలను ప్రభుత్వం ద్వారా పరిష్కరింపజేసే సత్తా, పోరాట పటిమ టీఎస్‌యూటీఎఫ్ సంఘానికే ఉందని సంఘం జిల్లా అధ్యక్షులు రత్నం, రాములు, నర్సింహులు, డి.శ్రీనివాస్ అన్నారు. తాండూరు మండలం గౌతాపూర్, కరణ్‌కోట, చెంగోల్, ఐనెల్లిలోని ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు.

పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమానికి కృషి

పరిగి,న్యూస్‌టుడే: పట్టణాభివృద్ధిలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర అభినందనీయమని వారి సంక్షేమానికి తమవంతు కృషి చేస్తున్నట్లు మున్సిపల్ ఛైర్మన్ అశోక్ కుమార్ తెలిపారు. సోమవారం స్వచ్ఛతాహీ సేవ - సఫాయి మిత్ర సురక్ష శివిర్ సందర్భంగా వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు ఆరోగ్యంగా ఉంటేనే పట్టణం స్వచ్ఛతగా ఉంటుందని చెప్పారు.

పరిగిలో హిందూ ఉత్సవ సమితి నిరసన ర్యాలీ

పరిగి, న్యూస్‌టుడే: తిరుపతి లడ్డూ కల్తీ వ్యవహారంపై పరిగిలో సోమవారం హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణంలోని శ్రీ లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ బీజాపూర్ -హైదరాబాద్ జాతీయ రహదారి, అంబేడ్కర్ కూడలి, గాంధీచౌక్ మీదుగా తహసీల్దారు కార్యాలయం వరకు కొనసాగింది. అనంతరం ఉప తహసీల్దారు నవీన్‌కుమార్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఉత్సవ సమితి అధ్యక్షుడు సోమ రమేష్‌కుమార్, మున్సిపల్ ఛైర్మన్ అశోక్‌కుమార్, ఐకాస అధ్యక్షుడు ఎం.నాగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

మోటార్ మరమ్మతుల దుకాణంలో చోరీ



చోరీ జరిగిన దుకాణం

తాండూరు గ్రామీణ, న్యూస్‌టుడే: మోటారు మరమ్మతుల దుకాణంలో చోరీ జరిగిన సంఘటన తాండూరు మండలం అల్లాపూర్‌లో జరిగింది. ఎస్సై విఠల్‌రెడ్డి కథనం ప్రకారం..అల్లాపూర్‌కు చెందిన కిరణ్‌కుమార్ ప్రధాన రహదారి వారగా మోటార్ వైండింగ్ దుకాణం నిర్వహిస్తున్నాడు. ఎప్పటిమాదిరి ఆదివారం రాత్రి పనులు ముగించుకొని దుకాణం మూసి ఇంటికి వెళ్లాడు. సోమవారం ఉదయం దుకాణం తెరిచేందుకు వెళ్లగా అప్పటికే తాళం పగులగొట్టి షెట్టర్ తెరిచి ఉండటంతో వెంటనే లోపలికి వెళ్లి పరిశీలించాడు. రూ.50వేలు విలువైన మోటార్లను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్న ఎస్సై వెల్లడించారు.